క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయంలో పూజలు



మైలవరం: మైలవరంలో ప్రారంభిస్తున్న వైఎస్సార్ సీపీ నూతన కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు దంపతులు బుధవారం పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించినట్లు ఇన్‌చార్జి తిరుపతిరావు తెలిపారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మత పెద్దలు, కుటుంబ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ చేయూత పంపిణీ

తిరువూరురూరల్: వైఎస్సార్ చేయూత పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సాయాన్ని గురువారం ఉదయం పంపిణీ చేయనున్నట్లు తిరువూరు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు 2,875 మంది లబ్ధిదారులకు రూ.5.39 కోట్ల మేర నాలుగో విడత ఆర్థికసాయాన్ని పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

నేడు రసాయన పరిశ్రమల్లో మాక్ డ్రిల్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి, జగ్గయ్యపేట ప్రాంతాల్లోని పరిశ్రమల్లో రసాయనిక విపత్తుపై ఎమర్జెన్సీ మాక్ ఎక్సైర్‌సైజ్ గురువారం నిర్వహిస్తున్నట్లు ఫ్యాక్టరీల డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలతో తెలిపారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఎంఏ), ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీఎస్‌డీఎంఏ) సంస్థలు ఈవెంట్ నిర్వహిస్తాయి. కొండపల్లి ఐడీఏలోని ఆర్చ్ ల్యాబరేటరీస్, జగ్గయ్యపేట కోహన్స్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్ ఫ్యాక్టరీల్లో మాక్ డ్రిల్ జరుగుతుందన్నారు. జిల్లా ఎమర్జెన్సీ అథారిటీ, జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో జరిగే మాక్ డ్రిల్‌లో ఫ్యాక్టరీలు, రెవెన్యూ, ఫైర్, పోలీస్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ మెడికల్ తదితర శాఖల అధికారులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలోని సుందరయ్య నగర్‌లో సుమారు 120 గృహాల్లో ప్రజల నివాసం ఉంటున్నారు. 15 ఏళ్ల నుంచి కాలనీలో సరైన రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు సుందరయ్య నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించినప్పుడు కాలనీవాసులు రోడ్డు లేక ఇబ్బంది పడుతున్నామని వివరించారు. త్వరలో సిమెంటు రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బుధవారం సుందరయ్య నగర్‌లో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కాలనీవాసుల కష్టాలు నెరవేర్చినందుకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు సర్పంచ్ లింగవరపు రమేష్, ఎంపీటీసీ సభ్యుడు గుర్రం శ్రీనివాసరావు, కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

కాలేజీ ప్రిన్సిపాల్‌గా నవీనలావణ్యలత



నూజివీడు: కృష్ణా విశ్వవిద్యాలయం పరిధిలోని నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్ ప్రిన్సిపాల్‌గా జీ నవీన లావణ్య లతను నియమిస్తూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జీ జ్ఞానమణి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య కే శోభన్‌బాబు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో నవీన లావణ్య లత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నవీన లావణ్య లత కృష్ణా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ బయో సైన్సెస్ అండ్ బయోటెక్నాలజీ విభాగంలో సహాచార్యులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న రసాయన శాస్త్ర ప్రొఫెసర్ ఆచార్య మండవ వెంకట బసవేశ్వరరావు వద్ద నుంచి ఆమె బాధ్యతలను స్వీకరించారు.

అవకాశవాదుల్ని నమ్మొద్దు

- విజయవాడ ఎంపీ కేశినేని
- తిరువూరులో నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభం



తిరువూరు నియోజకవర్గంలో గ్రామాలకు వాటర్ ట్యాంకర్లను ప్రారంభిస్తున్న ఎంపీలు

తిరువూరు: పేదల్ని ఉద్ధరిస్తామని మాయమాటలు చెప్పి ఎన్నికల్లో పోటీచేస్తున్న అవకాశవాదుల్ని ప్రజలు నమ్మవద్దని విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. తిరువూరులో నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతో అన్ని కుటుంబాలూ లబ్ధి పొందాయని, తెలుగుదేశం పార్టీ ప్రకటించే ఆరు గ్యారంటీలు ప్రజలకు అవసరం లేదన్నారు. ఎన్నికలు వచ్చినపుడే చంద్రబాబుకు బీసీలు గుర్తుకు వస్తారని, తన దత్తపుత్రుడితో కలిసి బీసీ డిక్లరేషన్ పేరుతో హంగామా చేస్తున్నారని ఎద్దేవా చేశారు. 20 వేల గ్రామ సచివాలయాలు కట్టిన సీఎం జగన్‌ను విమర్శించే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలతో పాటు ప్రజా సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అవసరమైన అన్ని పథకాలనూ అమలు చేస్తున్నారన్నారు. తిరువూరు నియోజకవర్గం ఎల్లలు తెలియని వ్యక్తిని టీడీపీ అభ్యర్థిగా నిలిపారని, కేవలం ప్రచారం కోసం ఎదుటి వ్యక్తుల మీద బురదజల్లడమే ఆయన పనిగా పెట్టుకున్నారన్నారు. ఆరోగ్యశ్రీ, విద్యాదీవెన, వైఎస్ఆర్ ఆసరా, చేయూత తదితర పథకాల ద్వారా అన్ని వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తుంటే టీడీపీ నాయకులు ప్రజల్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు వెల్లంపల్లి శ్రీనివాస్, నియోజకవర్గ పరిశీలకుడు గౌతమ్‌రెడ్డి, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుధారాణి, తిరువూరు, గంపలగూడెం, ఏకొండూరు, విస్సన్నపేట మండలాల నాయకులు నరెడ్ల వీరారెడ్డి, రేగళ్ల మోహనరెడ్డి, కలకొండ రవికుమార్, పిల్లి వనజాక్షి, గాజుల శ్రీనివాసరావు, రెడ్డి శ్రీనివాసరావు, యరమల రామచంద్రారెడ్డి, తాళ్ళూరి నవీన్‌కుమార్, చావా వెంకటేశ్వరరావు, గుడిపూడి నారాయణరావు, గజ్జల సీతారామారావు, దేవిశెట్టి బాలకృష్ణ, భూక్యా రాణి, నెక్కలపు కుటుంబరావు, నాగమల్లేశ్వరి, భూక్యా గన్యా, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక..

తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్తలు పలువురు బుధవారం ఎంపీ కేశినేని నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కొత్తపల్లి చంద్రశేఖర్, గొల్లమందల జర్మియా (జిన్నా), గురివిందపల్లి అజయ్‌మిత్రాల ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు పార్టీ సభ్యత్వం స్వీకరించగా, వారికి పార్టీ కండువాలు కప్పి ఎంపీలు నానీ, అయోధ్య రామిరెడ్డి, తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు ఆహ్వానించారు.

19 గ్రామాలకు వాటర్ ట్యాంకర్ల అందజేత..

తిరువూరు నియోజకవర్గంలోని 19 గ్రామాలకు వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరైన నిధులతో కొనుగోలు చేసిన వాటర్ ట్యాంకర్లను ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), అయోధ్యరామిరెడ్డి తిరువూరులో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు.

పేదలకు పట్టాభిషేకమే జగనన్న అజెండా

మంత్రి జోగి రమేష్



వైఎస్సార్ సీపీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

జి.కొండూరు: పేదోడిని చట్టసభలకు పంపాలన్న జగనన్న సంకల్పం నెరవేరాలంటే పులివెందుల తర్వాత మైలవరంలోనే అత్యధిక మెజారిటీని కట్టబెట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కోరారు. మైలవరంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), నియోజకవర్గ ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు, నియోజకవర్గ పరిశీలకుడు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి జోగి రమేష్ బుధవారం రాత్రి ప్రారంభించారు. జోగి రమేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పెత్తందారుడుకి జరుగుతున్న యుద్ధంలో పెత్తందారుడుని తరిమికొట్టాలని కోరారు. వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి తన స్పిన్నింగ్ మిల్స్‌లో నష్టాలు వస్తున్నాయని చెబితే రూ.కోట్లు ఇన్‌సెంటివ్స్ ఇచ్చిన జగనన్నకు నమ్మకద్రోహం చేసి పార్టీ మారాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ భిక్ష పెట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద నిందలు వేస్తున్న వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని ప్రజలు క్షమించరన్నారు. డబ్బు మదంతో అహంకార పూరిత రాజకీయాలు చేస్తున్న వసంత వెంకటకృష్ణప్రసాద్‌ని సామాన్యుడు సర్నాల తిరుపతిరావు ఓడించబోతున్నాడని చెప్పారు. అణగారిన వర్గాలకు మేలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. కుప్పంలో చంద్రబాబు, మంగళగిరిలో లోకేష్, పిఠాపురంలో పవన్‌కళ్యాణ్ ఓడిపోతున్నప్పుడు వైనాట్ 175 అన్నారు.

వైఎస్సార్ సీపీ జెండానే సామాన్యుడి బలం

-ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని)

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో చాలెంజ్ చేసే వ్యక్తి ఇంకా పుట్టలేదని విజయవాడ ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. మైలవరం ప్రస్తుత ఎమ్మెల్యే తన దగ్గర కోట్లు ఉన్నాయని విర్రవీగితే నా దగ్గర ప్రజా బలం ఉందని సామాన్యుడిని మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించిన ఘట్స్ ఉన్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఇప్పుడున్న ఎమ్మెల్యేని ఇసుక, మట్టి దోచుకుంటున్న మైలవరం వీరప్పన్ అని గతంలో వ్యాఖ్యానించిన పార్టీలోనే చేరడం సిగ్గుచేటన్నారు. మైలవరం పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి వచ్చిన వారిలో సగం మంది కూడా గుడివాడలో చంద్రబాబు సభకు రాలేదన్నారు. కుప్పం నియోజకవర్గ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధే కాకుండా తాగునీరిచ్చిన ఘనత కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలంటే జగనన్నే మరోసారి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. మైలవరం నియోజకవర్గ పరిశీలకులు అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మైలవరంలో పార్టీ విజయం చరిత్రలో నిలిచిపోయే తీర్పునివ్వాలని కోరారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నూతన పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



కౌన్సిల్ సభ్యులతో మాట్లాడుతున్న డ్వామా పీడీ సునీత, అధికారులు

జూపూడి (ఇబ్రహీంపట్నం): జూపూడిలో ఎస్ఆర్ఈజీఎస్ కౌన్సిల్ సభ్యులు బి. బాబురావు, చిట్టి జనార్ధన్ పర్యవేక్షణలో తొమ్మిది మంది సభ్యులు బుధవారం పర్యటించారు. ఉపాధిహామీ పథకం ద్వారా గ్రామంలో ఇప్పటి వరకు జరిగిన పనులు పరిశీలించారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, భవనాల వాటర్ రీచార్జ్ పిట్‌ల తయారీ, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఇంటింటికీ చెత్త సేకరణపై ఆరా తీశారు. లిక్విడ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ రాష్ట్ర ప్రాజెక్ట్ పరిశీలించి దాని ప్రయోజనాలు తెలుసుకున్నారు. డ్వామా పీడీ జె.సునీత జిల్లాలో ఉపాధిహామీ పనులు, కూలీల వినియోగం తీరును కౌన్సిల్ సభ్యులకు వివరించారు. ఉపాధి నిధుల వినియోగంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కౌన్సిల్ సభ్యులు ఎం.పుల్లారెడ్డి, పి.హేమంత్‌రెడ్డి, ఎల్.మనోహర్‌రెడ్డి, ఏ.లావణ్య కుమార్, కె.మరియమ్మ, విశ్వనాథ్, సర్పంచి కాకి దేవమాత, పంచాయతీ కార్యదర్శి పి.అనిల్‌కుమార్, ఏపీడీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు

తిరువూరు: ఈ నెల 8న మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా తిరువూరులోని శివాలయాలను సిద్ధం చేశారు. పాతబస్టాండు సెంటర్లోని శ్రీ చంద్రమౌళీశ్వరాలయం, బస్టాండు సెంటర్లోని శ్రీరామలింగేశ్వరాలయాల్లో గురువారం ఉదయం నుంచి శివరాత్రి వేడుకలు ప్రారంభమవుతాయి. తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం పరమేశ్వరుడ్ని పెండ్లి కుమారుడ్ని చేస్తారు. 8వ తేదీ తెల్లవారు ఝామున మూడు గంటల నుంచి అభిషేకాలు, నగరోత్సవం, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం అనంతరం లింగోద్భవ సమయంలో అభిషేకాలు నిర్వహిస్తారు. 9వ తేదీ ఉదయం పూర్ణాహుతి, రాత్రి 7 గంటలకు పవళింపుసేవతో మహాశివరాత్రి వేడుకలు ముగుస్తాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తిరువూరు గ్రూపు మేనేజరు జన్ను వెంకటేశ్వరరావు, ఆలయ ధర్మకర్త వేణుబాబు తెలిపారు.

16న జాతీయ లోక్‌అదాలత్

నూజివీడు: పట్టణంలోని కోర్టు భవనాల ప్రాంగణంలో ఈనెల 16న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ నాగశైలజ బుధవారం తెలిపారు. ఈనెల 9న లోక్ అదాలత్‌ను నిర్వహించాల్సి ఉండగా, దానిని ఈనెల 16 తేదీకి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చౌటపల్లి(వీరులపాడు): మండల పరిధిలో పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రాజకిశోర్ తెలిపారు. చౌటపల్లి, చట్టన్నవరం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. రాజకిశోర్ మాట్లాడుతూ సిబ్బంది ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

పరీక్షలకు 103 మంది గైర్హాజరు

నూజివీడు: ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షలలో భాగంగా బుధవారం నిర్వహించిన గణితం 1ఏ, బోటనీ, సివిక్స్ సబ్జెక్టులకు సంబంధించి 103 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలోని మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీ శారద జూనియర్ కళాశాల, సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాల, శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాల, శ్రీ సిద్ధార్థ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 1,790 మంది విద్యార్థులకు 103 మంది గైర్హాజరు కాగా 1,687 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించినట్టు తహసీల్దారు ఏవీ శాస్త్రి తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్లుగా దుర్గాప్రసాద్, టీ విజయ, ఉమాదేవి, సీహెచ్ జాన్, చంద్రశేఖర్‌శర్మ వ్యవహరించారు.

ఇంటర్ పరీక్షలకు 8 మంది గైర్హాజర్

ఆగిరిపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర పరీక్షల్లో భాగంగా 90 మంది విద్యార్థులకు 82 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు.

ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులు సాధ్యం



గానుగపాడు(తిరువూరురూరల్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదవాలని తిరువూరు ఎంఈవో శ్యామసుందర్ సూచించారు. బుధవారం గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సమయంలో పాటించాల్సిన నిబంధనలను వివరించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల అనంతరం తదుపరి కోర్సులు చదవడానికి సన్నద్ధం కావాలని కూడా సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, ఉపాధ్యాయులు రాంప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

సెన్సార్ల వినియోగంపై అవగాహన



మైలవరం: సెన్సార్‌ల వినియోగం, 3డి ప్రింటింగ్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూకే బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ కో ఆర్డినేటర్ ఎస్.సుమతి తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అటల్ టింకరింగ్ ల్యాబ్స్ మెంటార్షిప్ ప్రోగ్రామ్ ముగింపు వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా సమతి మాట్లాడుతూ ఈ వర్క్‌షాపు ద్వారా యువతలో ఉండే లక్ష్యం, సృజనాత్మకత, ఉహాశక్తిని పెంపొందించవచ్చన్నారు. ఈ లక్ష్యాన్ని ముందుకు తీసుకువెళ్ల డానికి జేఎన్టీయూ కాకినాడ, లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయన్నారు. చివరి రోజు విద్యార్థులతో ప్రాజెక్టు కోడింగ్, టింకర్ క్యాడ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎమ్.ఎల్.ఎస్. దేవకుమార్, యూనిసెఫ్ కన్సల్టెంట్ టి.సుదర్శన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే హరినాథరెడ్డి, ప్రోగ్రామ్ మేనేజర్, విగ్యన్ ఆశ్రమం, కిషోర్ గైక్వార్డ్, కళాశాల కోఆర్డినేటర్ డాక్టర్ బి.శివ హరిప్రసాద్, డాక్టర్ జి.ఆర్. భాగ్యలక్ష్మి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

522 మందికి వైద్య పరీక్షలు

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్షతో సమగ్ర ఆరోగ్య రక్షణ కలుగుతుందని జేఏఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ నరేంద్ర కృష్ణ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి, ఎంపీడీఓ పద్మావతీదేవి ఆధ్వర్యంలో అధ్యక్షతన బుధవారం కాట్రేనిపాడు హైస్కూల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ వైద్య శిబిరాన్ని డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ జగన్మోహన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, మేఘన, ప్రత్యేక వైద్య నిపుణుడు ప్రవీణ్ 522 మందికి వైద్య పరీక్షలు చేసి, ఎనిమిది మందిని మెరుగైన వైద్యం కోసం నూజివీడు ఆస్పత్రికి రిఫర్ చేశారు. 54 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి, 41 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. పీడీ నరేంద్ర కృష్ణ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ జి.సుహాసిని, ఎంపీటీసీ ఎస్.నాగమంజుల, వ్యవసాయ సొసైటీ అధ్యక్షుడు యనమదల రాజాప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు రాంబాబు, ఈఓపీఆర్డీ శ్రీనివాస్, వైద్య శాఖ, సచివాలయాల, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయండి



నూజివీడు సీడీపీవో ఎస్వై నూరాణిని సన్మానిస్తున్న ఎంపీపీ ఆరేపల్లి శిరీష దంపతులు



చాట్రాయిలో మహిళలను సన్మానిస్తున్న సిబ్బంది



తిరువూరులో మహిళా సదస్సులో మాట్లాడుతున్న మధుకీర్తి

నూజివీడు: మహిళలకు అవకాశాలు కల్పిస్తే రాణించని రంగమంటూ లేదని ఎంపీపీ ఆరేపల్లి శిరీష అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. దీనిలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి మహిళా ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేయాలని, అవకాశాలను అందిపుచ్చుకుంటూ తమకు ఆసక్తి ఉన్న రంగంలో రాణిస్తూ పైకి ఎదగాలన్నారు. ఆర్థికంగా బలోపేతం అయినప్పుడే మహిళలకు గుర్తింపు ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారత కోసం అనేక పథకాలను అమలు చేస్తూ వారి అభివృద్ధికి బాటలు వేశారన్నారు. అనంతరం మహిళలకు లెమన్ అండ్‌స్పూన్, కుర్చీలాట, అంత్యాక్షరి, బెలూన్ ఊదడం వంటి ఆటలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు సీడీపీవో ఎస్వై నూరాణిని సన్మానించారు. ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, ఏపీఎం దయాల రాజశేఖర్, మండల సమైక్య అధ్యక్షురాలు కొమారపు నవత, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చాట్రాయి: మారుతున్న కాలానుగుణంగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని తహసీల్దార్ మహ్మద్ మసూద్ ఆలీ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్, వెలుగు శాఖల మహిళలను సన్మానించారు. ఎంపీడీవో మంగా కుమారి, వెలుగు ఏపీఎం శేఖర్, ఐసీడీఎస్ సీడీపీవో కె.నాగేశ్వరి, ఎంఈవో బ్రహ్మచారి, ఏపీవో లక్ష్మీ, మండల మహిళా సమాఖ్య కార్యదర్శి తేళ్లూరి సరోజిని పాల్గొన్నారు.

మహిళా భాగస్వామ్యంతోనే సామాజాభివృద్ధి

తిరువూరు: సమాజంలో అన్ని రంగాల్లో మహిళా భాగస్వామ్యం పెరిగిందని, వ్యవసాయ రంగం నుంచి అంతరిక్షం వరకు మహిళలే ప్రధాన పాత్ర పోషిస్తున్నారని ప్రముఖ వైద్యురాలు మధుకీర్తి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఐద్వా, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. చట్టసభల్లో మహిళా ప్రాతినిధ్యం ఇంకా పెరగాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు శ్రావణి, లక్ష్మి, రవికుమారి, మరియమ్మ, పద్మ, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

'వాట్ నెక్స్ట్' పుస్తకం ఆవిష్కరణ



కెరీర్ గైడెన్స్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

ముసునూరు: పదో తరగతి విద్యార్థుల కోసం మండల ఉపాధ్యాయులు కెరీర్ గైడెన్స్ గ్రంథాలను రచించడం అభినందనీయమని ఎంఈఓ బీవీ సుబ్బారావు అన్నారు. జన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మండలానికి చెందిన ఆరుగురు ఉపాధ్యాయులు రచించిన వాట్ నెక్స్ (10 తరువాత ఏమిటి?) మీ లక్ష్యాన్ని ఎంచుకోండి, గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల జీవిత లక్ష్యాన్ని సరైన దిశలో నడిపే దిక్సూచిగా గ్రంథం ఉపకరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రచయితలు కేవీ నారాయణరావు, డి.బెనర్జీ, ఎం.ఫ్రాన్సిస్, బి.శ్రీనివాస్, డి.గంగాధర్, దేవేంద్ర అప్పారావును ఆయన అభినందించారు. అనంతరం గ్రంథ ప్రతులను ముసునూరు, చెక్కపల్లి, గుడిపాడు, రమణక్కపేట, వేల్పుచర్ల, గోపవరం, కాట్రేనిపాడు హైస్కూళ్ళ విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎంలు నిర్మలాదేవి, అబ్బాస్, రామకృష్ణారావు, శ్రీనివాస్, నాగేంద్రరావు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీల ప్రతినిధులకు శిక్షణ

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 7న ఉదయం 10.30 గంటలకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ వై.భవానీశంకరి బుధవారం తెలిపారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, పోస్టల్ బ్యాలెట్, ఎన్నికల కోడ్ అమలు, పోలింగ్ ఏజెంట్ల నియామకం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, పోలైన ఓట్ల వివరాలు, కౌంటింగ్ తదితర అంశాలపై ఈ శిక్షణలో రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామన్నారు. నియోజకవర్గంలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనాలని ఆర్డీఓ విజ్ఞప్తి చేశారు.